ఈనాడు
సిద్దిపేట
శుక్రవారం సెప్టెంబరు 27, 2024

నేతన్నల అభివృద్ధికి కృషి: మంత్రి


కొండా సురేఖకు నూలు దండ వేసి స్వాగతిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

దుబ్బాక, న్యూస్‌టుడే: దుబ్బాక ప్రాంతంలో చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించి, వారి అభివృద్ధికి అన్ని విధాల కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర దేవాదాయ అటవీ, పర్యావరణ శాఖల మంత్రి, ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం దుబ్బాక పట్టణంలోని వేడుక మందిరంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, నియోజకవర్గ కాంగ్రెస్ బాధ్యుడు చెరుకు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆమె పాల్గొన్నారు. వేదికపైన మంత్రికి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. చేనేత నూలు దండను మంత్రి మెడలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు వేశారు. చెరుకు శ్రీనివాస్‌రెడ్డి వేదిక పైకి రావడంతో ప్రొటోకాల్ విషయమై కాంగ్రెస్, భారాస మధ్య తగాదాతో కొంత గందరగోళం నెలకొంది. ఆమె మాట్లాడుతూ.. భారీ పోలీసుల బందోబస్తు మధ్య చెక్కుల పంపిణీ కార్యక్రమం జరగడం దురదృష్టకరమన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రొటోకాల్‌కు డోకా రాదన్నారు. తమ ప్రభుత్వం నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జులను ప్రోత్సహిస్తుందని స్పష్టం చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ సదానందం, పురాధ్యక్షురాలు గన్నె వనిత, తహసీల్దార్ వెంకటరెడ్డి, కమిషనర్ రమేశ్‌కుమార్, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత భారాస ప్రభుత్వ హయాంలో తాము ఏనాడు ప్రొటోకాల్ విస్మరించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి అంశం రాజకీయం చేయాలని చూస్తోందని విమర్శించారు. ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గంలో ఉన్న సమస్యల పరిష్కారానికి, ఇక్కడి చేనేత కార్మికుల సంక్షేమానికి, వారి అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి కొండా సురేఖను, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు.


పురపాలక సంఘం కొత్త కార్యాలయ భవనం

అవాంతరాలు దాటి నిర్మాణం పూర్తి

హుస్నాబాద్, న్యూస్‌టుడే: హుస్నాబాద్ పురపాలక సంఘానికి నూతన కార్యాలయ భవనం ప్రారంభానికి సిద్ధం అవుతోంది. రూ.5 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ భవన నిర్మాణం తుది మెరుగులు దిద్దుకుంటోంది. మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న హుస్నాబాద్ 2011లో నగర పంచాయతీగా ఏర్పాటైంది. నగర పంచాయతీగా ఉన్నపుడే కొత్త భవనం నిర్మాణానికి రూ.50 లక్షలు అప్పటి ప్రభుత్వం మంజూరు చేసి శంకుస్థాపన చేశారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. నగర పంచాయతీ పురపాలక సంఘంగా అప్‌గ్రేడ్ అయింది. కార్యాలయ భవన నిర్మాణానికి స్థలం కొరత ఏర్పడింది. ప్రైవేటు స్థలంలో నిర్మించాలనే యత్నాలు జరిగాయి.

భూమిచ్చిన రైతులు

కరీంనగర్ రోడ్‌లో రైతులు పురపాలికకు భూమి ఇచ్చారు. ఈ స్థలం పట్టణానికి దూరం ఉందని, ప్రజలకు అసౌకర్యంగా ఉంటుందని అక్కడ నిర్మాణం చేపట్టలేదు. పురపాలిక భవనానికి స్థలం సమస్యగా మారింది. స్థానిక మండల పరిషత్‌లో జాగా కేటాయించాలని పురపాలక వర్గం అప్పటి ప్రభుత్వాన్ని కోరింది. మండల పరిషత్ నుంచి కొంత అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. అప్పటి మంత్రి, ఎమ్మెల్యే, పాలనాధికారి, అదనపు పాలనాధికారి ప్రత్యేక చొరవ తీసుకుని స్థలం కేటాయించారు. హరీశ్‌రావు శంకుస్థాపన చేయించారు. ముందుగా మంజూరైన రూ.50 లక్షలు బ్యాంకులో డిపాజిట్ ఉండగా రూ.కోటికి పైగా వచ్చాయి. టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.2 కోట్లు కలిపి భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. తర్వాత నిధుల కొరత ఏర్పడటంతో మరో రూ.2 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం అత్యాధునికంగా జీ+2 తరహాలో నిర్మించారు. పనులు చివరి దశకు చేరుకున్నాయి. త్వరలోనే మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించనున్నారు.

జనానికి జ్వరం.. అప్రమత్తతే ఔషధం

న్యూస్‌టుడే, సిద్దిపేట:


సిద్దిపేట సర్వజన ఆసుపత్రిలో ఓపీ నమోదు చేసుకునే కౌంటరు వద్ద రద్దీ

సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాల అనుబంధ సర్వజన ఆసుపత్రి జ్వర పీడితులతో కిక్కిరిసిపోతోంది. వ్యక్తిగతం, పరిసరాల పరిశుభ్రత లోపం.. అవగాహన లేమి.. కరవైన ముందు జాగ్రత్త చర్యలతో జనం అవస్థ పడుతున్నారు. జిల్లా సర్వజన ఆసుపత్రిలో నెల వ్యవధిలో 2600 జ్వర కేసులు నమోదవడం ఆందోళనకు గురిచేస్తోంది. ఇంటిలో ఒకరికి వస్తే కుటుంబ సభ్యులంతా జ్వర బాధితులవుతున్నారు.

కంగాళీ వాతావరణం

అప్పుడే వర్షం.. కొంత సేపటికి ఎండ.. తర్వాత చలి.. ఇలా ఒకేరోజున ఒక్కోసారి వాతావరణం వివిధ రూపాల్లో ఉంటోంది. వానతో నీటి నిల్వల పెరుగుదల సహా పలు గ్రామాల్లో మురుగు వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ప్రత్యేకాధికారుల పాలనలో వెనువెంటనే పారిశుద్ధ్య సమస్యలు పరిష్కారం కావడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరో వైపు దోమల వ్యాప్తి పెరిగింది. వర్షాకాలంలో తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. డెంగీ, మలేరియా తదితర వాటికి వాహకాలుగా పని చేస్తున్నాయి. అత్యధిక శాతం జ్వరం, జలుబు, తలనొప్పి, దగ్గు, ఒళ్లు నొప్పులు, నీరసం, ఆకలి లేకపోవడం, కాళ్లు లాగటం, ఇతరత్రా సమస్యలతో బాధపడుతున్నారు. ఈ తరుణంలో పట్టణాల్లో దోమల నివారణకు తరచూ రసాయనాలు పిచికారీ సహా ఫాగింగ్ చేయాల్సి ఉంది.

ఇలా చేయాలి...

- దోమతెరలు, కర్టెన్లు విని యోగించాలి. కిటికీలకు జాలీలు ఏర్పాటు చేయాలి.
- నిండుగా వస్త్రాలు ధరించాలి.
- ఇంటి పరిసరాల్లో నిల్వ నీటిలో కిరోసిన్, ఆయిల్, ఇంజన్ వృథా ఆయిల్ చల్లాలి.
- నీటి నిల్వ లేకుండా పాత్రలు, కూలర్లు, డ్రమ్ములు ఖాళీ చేయాలి.

స్వీయ జాగ్రత్తలు తీసుకోవాలి

– డా.సురేశ్‌బాబు, సూపరింటెండెంట్, సిద్దిపేట సర్వజన ఆసుపత్రి

పర్యావరణంలో మార్పు, వర్షాల ప్రభావం, అపరిశుభ్రత కారణంగా జ్వరాలు, వ్యాధుల బారినపడే వారి సంఖ్య పెరుగుతోంది. జ్వరం, జలుబు, దగ్గు.. అనేక సమస్యలతో వస్తున్నారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూసుకోవాలి. కాచి వడబోసిన నీటిని, తాజా, వేడి ఆహారం తీసుకోవాలి. జ్వరం బారినపడితే జాప్యం లేకుండా సర్కారు దవాఖానాను ఆశ్రయించాలి.

ఆగస్టు 26 - సెప్టెంబరు 26 వరకు నమోదైనవి

- జ్వరం ఓపీ: 2400
- జ్వరం ఐపీ: 254
- డెంగీ: 27
- టైఫాయిడ్: 1
- ఆసుపత్రిలో పడకలు: 700
- వివిధ విభాగాల్లో వైద్యులు: 250 మందికి పైగా

సంవత్సరంలోగా కళాశాల నిర్మించాలి


గిడ్డంగిలో మందులపై ఆరా తీస్తున్న మనుచౌదరి

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: విద్యాసంవత్సరం ముగిసేలోగా నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులను పూర్తి చేయాలని గుత్తేదారును కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. గదులు, ల్యాబ్‌లు, హాస్టల్, వంటశాల నిర్మిస్తున్నట్టు ఇంజినీరింగ్ అధికారులు కలెక్టర్‌కు చెప్పారు. సిద్దిపేటలో కలెక్టర్ గురువారం విస్తృతంగా పర్యటించారు. రూ.40 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాల పనులను, పరిశీలించారు. కళాశాలకు సంబంధించి పట్టాభూమికి సంబంధించి కోర్టు కేసు వివరాలను తెలియజేయాలని తహసీల్దార్ సలీమ్‌కు సూచించారు. 50 పడకల ప్రభుత్వ ఆయూష్ ఆస్పత్రి, మెదక్-ఎల్కతుర్తి జాతీయ రహదారి నిర్మాణంలో సిద్దిపేట ఔటర్ రింగ్‌రోడ్డు మధ్యలో కల్వర్టు నిర్మించాల్సిన ప్రాంతం పరిశీలించారు. కల్వర్టు నిర్మిస్తే నీరు వెళ్లడానికి అవతలివైపు భూయజమానులు అంగీకరించటం లేదని కలెక్టర్‌కు అధికారులు తెలిపారు. కేంద్ర ఔషధ గిడ్డంగిలో మందుల సరఫరాపై ఆరా తీశారు. ఈఈలు మురళీకృష్ణ, శ్రీనివాస్, డీఈ విశ్వప్రసాద్ తదితరులు ఉన్నారు.

రక్షణాత్మకం



లేగ దూడలు తల్లి పాలు తాగేస్తాయేమోనని నోటికి వల కడుతుంటారు. కోహెడ మండలం తంగళ్లపల్లిలో ఓ యజమాని తమ కుక్క పిల్ల ఎక్కడా వ్యర్థాలు తినకుండా రక్షణకు మాస్కు బిగించారు. అనారోగ్యం సంక్రమించకుండా జాగ్రత్త తీసుకున్నారు. – న్యూస్‌టుడే, కోహెడ గ్రామీణం

బతుకమ్మకు దారివ్వరూ!



ఇది పంట చేలు కాదు.. సిద్దిపేటలోని ఎర్రచెరువు. గుర్రపుడెక్క, గడ్డి పెరిగింది. కొద్దిరోజుల్లో బతుకమ్మ సంబరాలు ప్రారంభం కానున్నాయి. మహిళలు ఎర్రచెరువు, నర్సాపూర్ వద్ద కుంటకు వచ్చి నీటిలో బతుకమ్మలను సాగనంపుతారు. చెరువు, కుంటల్లో నీరు కంటే నీటిలోని గుర్రపుడెక్క ఎక్కువ వైశాల్యంలో ఉంది. దానిని వెంటనే తొలగించి బతుకమ్మ పండుగకు దారి ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సిద్దిపేట టౌన్

విరిగితే.. సరిచేస్తే సరి



సిద్దిపేట పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం చుట్టూ సుందరీకరణలో భాగంగా ఇనుప గ్రిల్స్ గతంలో ఏర్పాటు చేశారు. అందులో కొన్ని ఇలా విరిగిపోయాయి. అధికారులు పట్టించుకొని మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సిద్దిపేట

క్యాంటీన్లతో మహిళా శక్తి రుచికరం

మెప్మా పరిధిలో.. పట్టణాలు: 5 ● వార్డులు: 115 ● మహిళా సంఘాలు: 4166 ● సభ్యులు: 43,064

న్యూస్‌టుడే, సిద్దిపేట:

మూడు పట్టణాల్లో ఏర్పాటుకు కసరత్తు


హనుమకొండలోని ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ సందర్శనలో అధికారులు, సిబ్బంది, సంఘాల సభ్యులు

పేదరికాన్ని నిర్మూలిస్తూ.. మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ఇందిర మహిళా శక్తి పథకం (ఐఎంహెచ్‌ఎస్) కింద మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుకు ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. మహిళా (ఎస్‌హెచ్‌జీ) సంఘాల్లోని సభ్యులు.. ఆర్థిక స్వావలంబన సాధించడంతో పాటు మరో నలుగురికి ఉపాధి కల్పించేందుకు దోహదం చేయనుంది. తదనుగుణంగా జిల్లాలో మెప్మా (పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) ఆధ్వర్యంలో ఈ ఏడాది మూడు మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటుకు లక్ష్యంగా నిర్దేశించుకోగా.. త్వరితగతిన అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు వేగవంతమయ్యాయి.

ముందుగా రద్దీ ప్రాంతాలు

జిల్లాలో శుచి, రుచి, నాణ్యత కలిగిన ఆహార కేంద్రాలు (క్యాంటీన్లు) అందుబాటులోకి తెచ్చేందుకు మెప్మా అధికారులు దృష్టి సారించారు. పట్టణాల్లో ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో రద్దీ ప్రాంతాలను ఎంపిక చేశారు. ఒక్కో క్యాంటీన్ ఏర్పాటుకు రూ.10 -20 లక్షల వరకు పూచీకత్తు లేకుండా, వడ్డీలేకుండా బ్యాంకు రుణాన్ని ఇవ్వనున్నారు. జిల్లా పరిధిలో మొదటగా మూడు క్యాంటీన్లను వచ్చే నెలలో అందుబాటులోకి తేనున్నారు. ప్రభుత్వ సముదాయాల వద్ద కొన్నాళ్లు భవన అద్దెకు మినహాయింపు ఇస్తారు. ఒక్కో సంఘంలో ఐదు నుంచి పది మంది సభ్యులుగా ఉంటారు. మొత్తంగా సంఘాలకు రూ.31 లక్షల రుణం దక్కనుంది. క్యాంటీన్ల నిర్వహణలో భాగంగా తొలుత మహిళా సంఘాలతో మెప్మా సిబ్బంది క్షేత్ర పర్యటనలు చేపడుతున్నారు. అవసరమైన సామగ్రి కొనుగోలు చేస్తారు.

క్యాంటీన్లు వచ్చే ప్రాంతాలు

- సిద్దిపేట - కోర్టు ప్రాంగణం
- గజ్వేల్ - మున్సిపల్ కార్యాలయం
- హుస్నాబాద్ - ఆర్టీసీ బస్ డిపో చౌరస్తా

నిర్వహణ ఇలా..

- పరిశుభ్ర వాతావరణంలో నిర్వహించాలి. ఆహార పదార్థాల నాణ్యత, రుచికి పెద్దపీట వేయాలి.
- ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు తెరవాలి.
- ఉదయం, సాయంత్రం అల్పాహారం, చిరుతిళ్లు, తేనీరు, మధ్యాహ్నం భోజనం ఉంటుంది.
- తెలంగాణ పిండివంటలు ప్రత్యేకంగా ఉంటాయి. అందుబాటు ధరలకు విక్రయిస్తారు.

ఆర్థికంగా బలోపేతం: హనుమంతరెడ్డి, మెప్మా పీడీ

మొత్తం ఐదు దరఖాస్తులు వచ్చాయి. మూడింటిని ఎంపిక చేస్తాం. రానున్న రోజుల్లో కోమటిచెరువు, సిద్దిపేట మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నాం. ప్రజలకు నాణ్యమైన ఆహార ఉత్పత్తులు అందుబాటులోకి తేవడంతో పాటు మహిళా సంఘాల్లోని సభ్యులు ఆర్థికంగా బలోపేతం అవుతారు. దరఖాస్తు చేసుకుంటే లక్ష్యం, ప్రాధాన్యం మేర మంజూరు చేస్తాం.

'ఖాళీ' డబ్బాతో 'బీపీ' పెరిగే..!



న్యూస్‌టుడే, సిద్దిపేట టౌన్: ప్రజల ఆరోగ్యం కోసం ఏర్పాటు చేసిన బీపీ (రక్తపోటు) స్వయంగా తనిఖీ చేసుకునే పరికరాలు లేకపోవడంతో పర్యాటకులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సిద్దిపేట కోమటి చెరువు కట్ట నెక్లెస్ రోడ్డు వద్ద రెండేళ్ల క్రితం రక్తపోటు పరికరం ఉండేది. పర్యాటకులు, ఉదయపు నడకకు వచ్చేవారు చెక్ చేసుకునేవారు. పరికరం పాడవడంతో అక్కడినుంచి దానిని తొలగించారు. డబ్బా ఖాళీగా బోసిపోయి కనిపిస్తోంది. ఎక్స్‌ప్రెస్ బస్టాండ్ ఆవరణలో సైతం నెల రోజుల నుంచి పరిస్థితి ఇలాగే ఉంది. సీఎస్ఆర్ నిధులతో నాడు పట్టణంలో నాలుగు చోట్ల ఏర్పాటు చేశారు. రెండు ప్రాంతాల్లోనే పని చేస్తున్నాయి.

ముఖాముఖీకి ౯౧ మంది హాజరు


అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న అధికారులు


మెదక్ టౌన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయుష్ ఆరోగ్య కేంద్రాల్లో యోగా శిక్షకులకు గురువారం మెదక్‌లోని ఆయుర్వేద వైద్యశాలలో ముఖాముఖి నిర్వహించారు. మూడు జిల్లాల నుంచి 91 మంది హాజరయ్యారు. డైరెక్టర్ ఆఫ్ ఆయుష్ కమిషన్ ద్వారా నియంచిన కమిటీ ఆధ్వర్యంలో ఎంపిక కొనసాగింది. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు ఆయుష్ ఏడీ డాక్టర్ వసంతరావు మాట్లాడుతూ.. రోగాల నుంచి ప్రజలు ఉపశమనం పొందేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా యోగ శిక్షణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా శిక్షకులు తరగతులను ఉచితంగా నిర్వహిస్తారన్నారు. కమిటీ కన్వీనర్, వరంగల్ ఆర్డీడీ డాక్టర్ ప్రమీలాదేవి, జిల్లా ఆయుష్ వైద్యాధికారి మనోహర్‌రెడ్డి, నేచురోపతి వైద్యుడు దేవయ్య, మెదక్, సర్దన, సిద్దిపేట, సంగారెడ్డి ఆయుష్ వైద్యాధికారులు మధుమిత, విజ్ఞత, ఉమాదేవి, నర్మద షిండే తదితరులు పాల్గొన్నారు.

28న లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

సిద్దిపేట టౌన్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 28న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి వెల్లడించారు. అదాలత్‌లో కేసుల పరిష్కారానికి 3,700 కేసులు గుర్తించామన్నారు. రోడ్డు ప్రమాదాలు, కుటుంబ తగాదా కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు లాంటి వాటిని పరిష్కరించుకోవచ్చన్నారు. కక్షిదారులు సైతం ఎలాంటి పట్టింపులకు పోకుండా రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవాలన్నారు. లోక్‌అదాలత్‌లో పరిష్కరించబడిన కేసులు తిరిగి అప్పీలుకు వెళ్లే అవకాశం ఉండదన్నారు.

ధాన్యం కొనుగోలు.. ముందస్తు కసరత్తు

న్యూస్‌టుడే, గజ్వేల్, సిద్దిపేట:


గజ్వేల్‌లో ధాన్యం కొనుగోలు

ధాన్యం కొనుగోళ్లకు జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. పంట చేతికొచ్చే సరికి జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు సిద్ధంగా ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దళారీలకు ఏమాత్రం అవకాశం లేకుండా మద్దతు ధర రైతులకు అందేలా చర్యలు చేపట్టనున్నారు. ధాన్యం ఎక్కువ స్థాయిలో వచ్చే అవకాశం ఉండటంతో 4 లక్షల క్వింటాళ్లు కొనుగోలు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ప్రభుత్వం ఏగ్రేడు ధాన్యం క్వింటాలుకు రూ.2320, బీగ్రేడుకు రూ.2300 మద్దతు ధర ప్రకటించింది. గతేడాది ఇదే సీజన్‌లో 407 కేంద్రాల నుంచి 3.09 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నారు. ఈసారి 3.68 లక్షల ఎకరాల్లో సాగైంది. 9 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. ఈసారి ఐకేపీ ఆధ్వర్యంలో 211, ప్రాథమిక సహకార సంఘాల ద్వారా 200, మెప్మా 6 కేంద్రాలను ఏర్పాటు చేస్తాయి. గతం కంటే 750 టార్పాలిన్లు అదనంగా సమకూర్చుతున్నారు. ధాన్యం రవాణా నిమిత్తం ఐదు సెక్టార్లుగా విభజించారు. చేర్యాల, దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్, సిద్దిపేటలో గుత్తేదార్లు కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం రవాణా చేస్తారు. టెండరు ప్రక్రియ పూర్తయింది. ఉన్నతాధికారుల నుంచి ఆమోదం రావాల్సి ఉంది. వారం రోజుల్లో ప్రక్రియ పూర్తవుతుంది.

ప్రణాళిక ఇది

- మొత్తం కేంద్రాలు: 417
- గన్నీ సంచుల అవసరం: కోటి
- అందుబాటులో..: 35 లక్షలు
- టార్పాలిన్ల అవసరం: 8400
- ప్రస్తుతం ఉన్నవి: 8000
- తేమ లెక్కించే మీటర్లు: 532
- తూకం యంత్రాలు: 660
- ధాన్యం శుభ్రం చేసే యంత్రాలు: 588

అక్టోబరులో అందుబాటులోకి..

– ప్రవీణ్, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల సంస్థ

సన్నరకం ధాన్యంపై రూ.500 బోనస్ ఉంటుంది. విధివిధానాలు రావాల్సి ఉంది. కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ ఇస్తాం. అక్టోబరులో కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి వస్తాయి. నవంబరు మొదటి వారం నుంచి ధాన్యం రాక మొదలవుతుందని అంచనా.

అక్రమ నిర్మాణాలపై బల్దియా కొరడా


కూల్చివేతను పరిశీలిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది

సిద్దిపేట, న్యూస్‌టుడే: సిద్దిపేటలో అక్రమ నిర్మాణాలపై బల్దియా అధికారులు కొరడా ఝుళిపించారు. 5వ వార్డులో తప్పుడు ధ్రువపత్రాలతో అనుమతి పొంది చేపట్టిన గృహ నిర్మాణంపై చర్యలు చేపట్టారు. సంబంధిత వివరాలను బల్దియా కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ గురువారం వెల్లడించారు. తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించి ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం చేపడుతున్నారనే ఫిర్యాదుతో న్యాయ సలహా తీసుకొని పోలీసుల సమక్షంలో సంబంధిత గది, ప్రహరీని పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది జేసీబీతో కూల్చివేశారు. 32వ వార్డులో ఎర్రచెరువు వద్ద బఫర్ జోన్‌లో ఇంటి నిర్మాణాన్ని కూల్చివేశారు. టీపీవోలు దేవరాజు, నస్రీన్‌భాను, టీపీఎస్ స్రవంతి, నీటిపారుదల, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నిర్మాణాలు చేపట్టే ముందు తప్పక బల్దియా అనుమతి పొందాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

సిద్దిపేట అర్బన్, చేర్యాల: విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా సిద్దిపేట గ్రామీణ మండలం చింతమడక, సీతారాంపల్లి, మాచాపూర్, నారాయణరావుపేట మండల కేంద్రం, ఇబ్రహీంపూర్, బంజేరుపల్లి, కోదండరావుపల్లి, లక్ష్మీదేవిపల్లి గ్రామాలలో శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ శ్రీనివాసులు తెలిపారు. రైతులు, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు. ● కొమురవెల్లిలోని విద్యుత్తు ఉపకేంద్రానికి వచ్చే 33కేవీ ఫీడర్ పనుల నిమిత్తం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ కొమురవెల్లి మండల ఏఈ మధు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. దీంతో కొమురవెల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని కొమురవెల్లి, ఐనాపూర్, కిష్టంపేట, గౌరాయపల్లి, రాంసాగర్ గ్రామాలకు 'త్రీ పేజ్' సరఫరా నిలిపివేస్తున్నట్లు, గృహావసరాలకు సింగిల్ పేజ్ సరఫరా చేస్తామని పేర్కొన్నారు.


బస్తాలతో నీటికి అడ్డుకట్ట

హుస్నాబాద్: హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువుకు చెందిన మరో తూములో సమస్య ఏర్పడి ఐదు రోజులగా నీరు వృథాగా పోయింది. వారం రోజుల క్రితమే చెరువు కింది తూము లీకేజీ వల్ల రైతులు ఆందోళన వ్యక్తం చేయగా షట్టర్ వద్ద మట్టితో నింపి నీరు బయటకు రాకుండా కట్టడి చేశారు. కాలువ ద్వారా నీరు పొంగి చెరువు సమీపంలో ఉన్న ఇళ్లకు చేరాయని మాజీ ఎంపీపీ వెంకట్ తెలిపారు. నీటిపారుదలశాఖ కార్యనిర్వాహక ఇంజినీరు గురువారం రాములునాయక్ చెరువు వద్ద పరిశీలించారు. తూము నుంచి నీరు బయటకు రాకుండా ఇసుక బస్తాలు అడ్డు వేసి వృథాను నిలువరించారు. లీకేజీ పనుల గురించి ఈఈ మాట్లాడుతూ తాత్కాలిక మరమ్మత్తు పనులకు నిధులు లేవన్నారు.

దర్శనీయం.. తీర్చిదిద్దితే పర్యాటకం

విశేషాల వేదికగా ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాలు





ఆనందం, ఆహ్లాదం సొంతం చేసుకునేందుకు నచ్చిన ప్రదేశాన్ని సందర్శిస్తుంటారు. సంస్కృతి, సంప్రదాయ, ఆధ్యాత్మిక వారసత్వ కట్టడాలు, జల వనరులు, ప్రాజెక్టులు, అటవీ, ఇతర ప్రాంతాలు.. ఎన్నో పర్యాటకంగా ఆదరణ పొందుతున్నాయి. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లోనూ ఎన్నో ప్రాంతాలు పేరొందాయి. పెరుగుతున్న జనాభా, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సందర్శనీయ ప్రాంతాలను సుందరీకరించాలని జిల్లాలవాసులు కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తే ప్రజలకు ఆహ్లాదం, ప్రభుత్వానికి ఆదాయం పెరగడం ఖాయం. నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

అభివృద్ధి అవశ్యం

గజ్వేల్: 50 టీఎంసీల సామర్థ్యంతో గజ్వేల్-దుబ్బాక నియోజకవర్గాల మధ్య నిర్మించిన కొమురవెల్లి మల్లన్నసాగర్‌ను పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు గతంలో ప్రతిపాదనలు పంపించగా కార్యరూపం దాల్చలేదు. 23 కి.మీ. పొడవుతో నిర్మించిన భారీ ఎత్తున కట్ట, ఒక పక్క కొండలు, చెట్లతో ఆహ్లాదం పంచే ఈ ప్రాజెక్టును చూసేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి సందర్శకులు వస్తున్నారు. సౌకర్యాల కరవుతో సందర్శకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మత్స్య సంపద, ప్రాజెక్టు చెంతన పచ్చని పొలాలు, ప్రకృతి రమణీయత ఉట్టిపడే ఇక్కడి అందాలను తనివితీరా చూడవచ్చు. జలాశయం వద్ద వసతుల కల్పనతో ఆదాయం ఖాయం.



చరిత్ర ఆనవాళ్లు పదిలం

కొండాపూర్: శాతవాహనుల కాలంలో వెలిగిన కొండాపూర్‌లో నేలమాళిగల అవశేషాలెన్నో లభ్యమయ్యాయి. అప్పటి నాణేలు, ఆభరణాలు కూడా బయల్పడ్డాయి. గొప్ప బౌద్ధ క్షేత్రంగా విలసిల్లినట్లు ఆధారాలెన్నో ఉన్నాయి. ఆదిమానవుల ఆనవాళ్లూ తవ్వకాల్లో బయల్పడ్డాయి. రాతి యుగం నాటి పనిముట్లు లభించాయి. వాటితో మ్యూజియం ఏర్పాటుచేశారు. సందర్శకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలి. భోజనశాల ఏర్పాటు చేస్తే బాగు.



మొసళ్ల అభయారణ్యం


సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మండలం కల్పగూరు శివారులో మంజీర జలాశయాన్ని 1978లో వన్యప్రాణి అభయారణ్యంగా గుర్తించారు. ఇక్కడ 580 మొసళ్లు ఉన్నట్లు అధికారుల లెక్క. మొసళ్ల సంతాన వృద్ధి కేంద్రం కూడా ఇక్కడ ఉంది. రాంసర్ సైట్‌గా గుర్తింపునకు ప్రతిపాదనలు పంపారు. ఆమోదిస్తే జాతీయ స్థాయిలో గుర్తింపు రానుంది. సందర్శకులకు అన్ని వసతులు కల్పించాలి. చిన్నారులు ఆడుకునేలా ఏర్పాట్లు చేయాలి. పార్కును విస్తరించాలి.

'సాగర్'ను తీర్చిదిద్దితే..



సిద్దిపేట: సిద్దిపేటకు సమీపంలో 3 టీఎంసీల సామర్థ్యంతో రంగనాయక సాగర్‌ను నిర్మించారు. దీని మధ్య ద్వీపం (45 ఎకరాలు) ప్రత్యేక ఆకర్షణ. జలాశయం చుట్టూ 8.65 కి.మీ. కట్ట తీర్చిదిద్దారు. నిత్యం 200 మంది వరకు సందర్శిస్తున్నారు. పర్యాటకులకు వసతులు కరవయ్యాయి. ప్రత్యేక నిర్మాణాలు లేవు. ప్రి వెడ్డింగ్, లఘుచిత్రాలు, ఇతర వాటికి వేదికైంది. సైక్లింగ్ పోటీలకు అనువైన వాతావరణం ఉంది. పర్యాటక ధామంగా అభివృద్ధికి గతేడాది రూ.125 కోట్లు వెచ్చించి పనులు ప్రారంభించగా, అవి నిలిచిపోయాయి. వీటిని పూర్తిచేస్తే ఉమ్మడి జిల్లా, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, హైదరాబాద్ నుంచి పర్యాటకులు వచ్చే అవకాశం ఉంది.


జిల్లాల సరిహద్దులో..



పోచారం వన్యప్రాణి అభయరణ్యం

మెదక్, హవేలిఘనపూర్: మెదక్, కామారెడ్డి జిల్లాల సరిహద్దులో ఉన్న పోచారం అభయారణ్యం, పోచారం ప్రాజెక్టు వద్ద సరైన వసతులు కరవయ్యాయి. వారాంతం, సెలవు రోజుల్లో 500 మందికిపైె వస్తున్నారు. ప్రాజెక్టుకు వెళ్లేందుకు మట్టి దారే ఉంది. దాన్ని బాగు చేయాలి. తాగునీటి వసతి కల్పించాలి. బోటింగ్ సౌకర్యం సైతం లేదు. శిథిలావస్థలో ఉన్న పురాతన కట్టడాలను బాగు చేయించాలి. కొన్నాళ్ల కిందట ప్రతిపాదించినా ఆమోదముద్ర పడలేదు.

రూపు మారిస్తేనే..



మెదక్, పాపన్నపేట: మెదక్ జిల్లాలో ప్రసిద్ధ ఏడుపాయల వనదుర్గమ్మ పుణ్యక్షేత్రానికి ఏటా రూ.7 కోట్ల ఆదాయం సమకూరుతోంది. ప్రస్తుతం 45 వరకు సత్రాలు ఉన్నాయి. దాత సాయంతో ఒక తాగునీటి ప్లాంట్ ఏర్పాటు చేశారు. నిత్యం వెయ్యి మందికిపైె దర్శించుకుంటున్నారు. భక్తుల సౌకర్యార్థం కాటేజీలు నిర్మించాలి. సేదతీరేలా పెద్దహాల్ మాదిరిగా నిర్మించాలి. పార్కింగ్ స్థలాలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీటిపై దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

సేదతీరేలా..



ధారూర్: వికారాబాద్ జిల్లా కేంద్రానికి కోట్‌పల్లి ప్రాజెక్టు 20 కి.మీ. దూరంలో ఉంటుంది. అనంతగిరి అనంతపద్మనాభ స్వామిని దర్శించుకొని ఇక్కడికి వస్తుంటారు. వారాంతాల్లో 500 మందికిపైగా సందర్శిస్తున్నారు. సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. తాగునీరు, కూర్చునేందుకు, సేదతీరడానికి బెంచీలు ఏర్పాటు చేయాలి. పార్కు, పిల్లలు ఆడుకునేలా వస్తువులు అందుబాటులోకి తీసుకొస్తే బాగు. ప్రాజెక్టులో బోటింగ్ సౌకర్యం మాత్రమే ఉంది. ఈత కొలను ఏర్పాటుకు డిమాండ్ ఉంది.

బాల మణిపూసలు

సాహిత్యంలో కవిత్వానిది కీలక పాత్ర. సామాజిక అంశాలను సరళ పదాలతో వ్యక్తపరిచి ఆలోచింపజేయడం కవిత్వం ప్రత్యేకత. తెలుగు భాషపై కొంత పట్టు ఉంటేనే ఇది సాధ్యమవుతుంది. ఈ విషయాన్ని గ్రహించారు తెలుగు ఉపాధ్యాయుడు వడిచర్ల సత్యం. విద్యార్థి దశలోనే తెలుగు కమ్మదనాన్ని తెలియపరిచి వారిలో ఆసక్తిని పెంచేందుకు కృషి చేశారు. భాషపై మమకారాన్ని పెంచి.. వారితో అక్షర సుమాలను పేర్పించారు. ఉపాధ్యాయుడి సంకల్పాన్ని అందుకున్న చిన్నారులు నిరంతరం సాధన చేసి అక్షరాలకు హారతి పట్టారు. వారే జహీరాబాద్ మండలం గొట్టిగారిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు. 51 మంది చిన్నారులు రాసిన 450 కవితలు 'గొట్టిగారిపల్లి మణిపూసలు' పేరిట పుస్తక రూపం దాల్చాయి. ఆరు నుంచి పదోతరగతి చిన్నారులు ఇందులో భాగస్వాములు అయ్యారు. ఎమ్మెల్యే [illegible] పుస్తకాన్ని శుక్రవారం ఆవిష్కరించనున్నారు. వడిచర్ల సత్యం ఇప్పటి వరకు 12 పుస్తకాలకు పైగా రాశారు. ఈ సారి విద్యార్థులతో రాయించడమే లక్ష్యంగా ముందుకు సాగారు. గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు సహకారంతో... – న్యూస్‌టుడే, పాత తాండూరు, జహీరాబాద్



రాసిన పుస్తకాలతో విద్యార్థులు

చిన్నారులతో రాయించడం సంతృప్తినిచ్చింది: వడిచర్ల సత్యం

నేను రాయడం కంటే నావద్ద చదువుకున్న విద్యార్థులంతా కవితలు రాసి, వినిపించడం సంతృప్తినిచ్చింది. వాటిని ఒక చోట చేర్చి, పుస్తకంగా రూపొందించాం. తెలుగు భాష ఉన్నతికి, బాలల్లో భాషా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు కృషి చేయాలన్నదే నా ధ్యేయం.

---

16 ఏళ్లకు పండగ

● ఉమ్మడి మెదక్ జిల్లాలో 292 మందికి దక్కనున్న ఉద్యోగాలు



ఉమ్మడి రాష్ట్రంలో నిర్వహించిన డీఎస్సీ-2008 అభ్యర్థుల విషయమై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఎట్టకేలకు ఊరట లభించింది. డీఈడీ అభ్యర్థుల కన్నా మెరిట్ ఉన్న బీఈడీ అభ్యర్థులను ఒప్పంద పద్ధతిలో సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ)గా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 24న సదరు నిర్ణయం తీసుకోగా.. సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ నిర్ణయంతో అప్పటి అభ్యర్థులకు ఒప్పంద కొలువులు దక్కనున్నాయి. దీని వల్ల ఉమ్మడి జిల్లాలో 292 మంది ప్రయోజనం పొందనున్నారు.

30 శాతం మేర..

డీఎస్సీ 2008 నియామకాల చివరి నిమిషంలో 30 శాతం పోస్టులను డీఈడీ అభ్యర్థులకు కేటాయించడంతో బీఈడీ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయారు. డీఈడీ అభ్యర్థుల కన్నా ఎక్కువ మార్కులు వచ్చినా ఉద్యోగాలు రాలేదు. తమకు అన్యాయం జరిగిందంటూ నష్టపోయిన వారంతా అప్పట్లో ఆందోళనకు దిగారు. అప్పటి నుంచి న్యాయ పోరాటం చేస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో 292 మందికి ఉద్యోగాలు దక్కనుండటం విశేషం.

27 నుంచి పరిశీలన..

అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ తీసుకున్న నిర్ణయంతో 16 ఏళ్ల తర్వాత ఒప్పంద ఉపాధ్యాయ కొలువులు దక్కనున్నాయి. వీరికి నెలకు రూ.31,030 చొప్పున వేతనం చెల్లించనున్నారు. కొలువులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఉమ్మడి జిల్లాల వారీగా డీఈవో కార్యాలయాల్లో విడుదల చేశారు. వాటిలో పేర్లున్న అభ్యర్థులు ఈ నెల 27 నుంచి వచ్చే నెల 5 వరకు జరిగే ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాల్సి ఉంది. విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉంచిన వెరిఫికేషన్ పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. జాబితాల్లో పేర్లున్న వారిలో కొందరు ఇప్పటికే ఇతర ఉద్యోగాలు చేస్తున్నారు. మరికొందరు ఇతర రంగాలు, వృత్తుల్లో స్థిరపడ్డారు. మరి వీరు ఎంత మంది ఒప్పంద ఎస్జీటీ ఉపాధ్యాయులుగా చేరుతారో అన్నది వేచి చూడాలి. ఇదిలా ఉండగా వీరిని ఏ పాఠశాలలకు కేటాయిస్తారు, ప్రస్తుతం జిల్లాలో ఖాళీగా ఉన్న ఎస్జీటీ పోస్టుల్లో నియమిస్తారా, లేదా ప్రత్యేక పోస్టులేమైనా సృష్టిస్తారా అన్నది తేలాల్సి ఉంది.

– న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం

వేడుకలకు చర్చి ముస్తాబు



చర్చి ప్రాంగణంలో వేదిక ఏర్పాట్లు

చర్చి ఆఫ్ సౌత్ ఇండియా (సీఎస్‌ఐ) కుటుంబం, శ్రీ మైత్రి సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మెదక్ సీఎస్‌ఐ చర్చిలో ఏర్పాట్లు పూర్తి చేశారు. నేడు (శుక్రవారం) నిర్వహించే ఈ వేడుకలకు మెదక్ డయాసిస్ పరిధిలోని ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు నిజామాబాద్, ఆదిలాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి రానున్నారు. డిప్యూటీ మోడరేటర్, మెదక్ ఇన్‌ఛార్జి బిషప్ డా.కె. రూబెన్ మార్క్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వీధుల్లో ర్యాలీ, చర్చి ప్రాంగణంలో సీఎస్‌ఐ, శ్రీ మైత్రి సంఘం పతాకాల ఆవిష్కరణ, అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేపట్టనున్నారు.

ఆసుపత్రి పూర్వవైభవం: సుమారు 20 ఏళ్ల కిందట వైద్య సేవలు అందించి మూతబడిన మెదక్ సీఎస్‌ఐ మిషన్ ఆసుపత్రికి పూర్వవైభవం రానుంది. బిషప్ బంగ్లా వెనుకాల కొనసాగిన ఈ ఆసుపత్రి నేడు చర్చి ప్రధాన ద్వారం వద్ద నిర్మించిన భవనంలో ప్రారంభించనున్నారు. భక్తుల కోసం ఏర్పాట్లు చేశామని ప్రెసిబేటరీ ఇన్‌ఛార్జి శాంతయ్య, చర్చి కమిటీ కోశాధికారి గంట సంపత్ తెలిపారు. - న్యూస్‌టుడే, మెదక్ అర్బన్


డ్రోన్‌తో గాలించినా దొరకని షాకీర్ ఆచూకీ



గాలింపు చర్యలను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: జహీరాబాద్ మండలం బూచినెల్లి వద్ద నారింజ వాగులో గల్లంతైన షాకీర్ కోసం పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ శివలింగం, తహసీల్దార్ రవీందర్ పర్యవేక్షణలో గురువారం తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని వాగు పరీవాహకం పొడువునా డ్రోన్ సాయంతో గాలింపు చేపట్టిన ఆచూకీ లభ్యం కాలేదు. నారింజ ప్రాజెక్టుతో పాటు కర్ణాటకలోని బరూర్, హుప్రానా, కంటానా శివార్లలో కురిసిన కుండపోత వర్షాలకు వాగులో వరద తగ్గుముఖం పట్టడం లేదు. గ్రామస్థుల సాయంతో గజ ఈతగాళ్లతో పాటు యువకుల సాయంతో వెతికినా ఫలితం లేకపోయింది. గాలింపు చర్యల్లో సమస్యలపై అధికారులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో శుక్రవారం ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని రప్పించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వాగు ఉద్ధృతంగా పారడంతో జహీరాబాద్-ఘనపూర్ మార్గాన్ని పూర్తిగా మూసివేశారు. రాకపోకలు నిలిపివేశారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి



నిజామొద్దీన్

పరిగి గ్రామీణ, న్యూస్‌టుడే: మూడు రోజులుగా కనిపించని ఓవ్యక్తి అనుమానాస్పద స్థితిలో చెరువులో శవమై కనిపించాడు. ఈ సంఘటన పరిగి మండల పరిధిలోని రాఘవాపూర్‌లో గురువారం జరిగింది. ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలు. మహ్మద్ నిజామొద్దీన్ (47) అవివాహితుడు. వ్యవసాయపనులు చేస్తూ... గ్రామంలో ఒంటరిగా ఉంటున్నాడు. మూడు రోజులుగా కన్పించలేదు. గురువారం స్థానికులు రాఘవాపూర్ చెరువు పరిసరాల్లోకి వెళ్లగా చెరువు ఒడ్డున అతడు వేసుకునే దుస్తులు, టవల్, చెప్పులు, ఇంటి తాళం చెవులు కనిపించడంతో ఆందోళనకు గురయ్యారు. చెరువులో దూరంగా శవంలా కనిపించడంతో అనుమానంతో కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్సై రమేష్, సిబ్బందితో కలిసి ఒడ్డుకు చేర్చారు. పోస్టుమార్టం నిమిత్తం పరిగి సామాజిక ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం



రాజు

దోమ, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు దుర్మరణం చెందిన ఘటన దోమ మండలం దిర్సంపల్లిలో చోటుచేసుకుంది. దిర్సంపల్లికి చెందిన బొల్లం రాజు(28) కుటుంబం పొలం దగ్గరే ఇల్లు నిర్మించుకొని నాలుగేళ్లుగా నివాసం ఉంటున్నారు. వ్యవసాయానికి సరఫరా చేస్తే నియంత్రిక (బుడ్డీ) నుంచి ఇంట్లోకి కరెంటు లాగారు. బుధవారం రాత్రి ఇంట్లోకి సరఫరా లేక చీకటి పడింది. దీంతో నియంత్రికలోని లివర్‌ను ఇనుపపైపుతో సరిచేసే ప్రయత్నం చేయబోయాడు. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడే పడిపోయాడు. తండ్రి అంజిలయ్య, భార్య స్వప్న గుర్తించి సీపీఆర్ విధానంలో కాపాడే ప్రయత్నం చేశారు. అదే రోజు రాత్రి కారులో వికారాబాద్ మిషన్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులతో పాటు భార్య కన్నీరుమున్నీరుగా విలపించారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	125-00	డ్రెస్డ్	213-00
రిటైల్	147-00	స్కిన్‌లెస్	243-00

చిన్నారిని లాలించి.. ఆప్యాయత చాటి..



చిన్నారిని లాలిస్తున్న మంత్రి కొండా సురేఖ

మెదక్, న్యూస్‌టుడే: రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ఓ చిన్నారిని లాలించి తన ఆప్యాయతను చాటారు. జిల్లా కేంద్రం మెదక్‌లో ఆరు గ్యారంటీల అమలుపై జరిగిన సమీక్షలో పాల్గొనేందుకు కలెక్టరేట్‌లోకి వెళ్తుండగా ఆరుబయట ఓ సీనియర్ మహిళా కానిస్టేబుల్ చేతిలో పసిబిడ్డను చూసి వెంటనే కాన్వాయ్ ఆపారు. ఆమె వద్దకు వెళ్లి ఎండగా ఉండటంతో చిన్నారికి నీటిని తాగించి వివరాలు ఆరా తీశారు. బాబు తల్లి సైతం తనతో పాటు విధులు నిర్వర్తిస్తున్నారని కానిస్టేబుల్ చెప్పింది. దీంతో బాబు తల్లి.. కానిస్టేబుల్ శ్రీలతను పిలిపించి మాట్లాడారు. వారిద్దరినీ తనతో పాటు కాన్వాయ్‌లో కలెక్టరేట్‌లోకి తీసుకెళ్లారు. పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి ఆ మహిళా కానిస్టేబుల్ పరిస్థితిని వివరించి మరోచోట డ్యూటీ వేయాలని ఆదేశించారు.

● చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని ఆమె పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వీరనారి చాకలి ఐలమ్మ అని, ఆ స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు అందించాలనే సంకల్పంతో హైదరాబాద్ కోఠిలోని మహిళా యూనివర్సిటీకి ఆమె పేరు పెట్టామని తెలిపారు. కలెక్టరేట్‌లో మొక్క నాటి నీళ్లు పోశారు. వనమహోత్సవంలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యేలు మైనంపల్లి రోహిత్ రావు, సునీతాలక్ష్మా రెడ్డి, ఎమ్మెల్సీలు సుభాష్‌రెడ్డి, యాదవరెడ్డి, కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎల్ఈడీ దీపాల తయారీపై శిక్షణ



తయారీపై శిక్షణ పొందుతున్న విద్యార్థులు

సిద్దిపేట, న్యూస్‌టుడే: జిల్లా ఎన్జీసీ (నేషనల్ గ్రీన్ కోర్) విభాగం ఆధ్వర్యంలో సిద్దిపేటలోని ఇందిరానగర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎల్ఈడీ దీపాల తయారీపై గురువారం కార్యశాల నిర్వహించారు. 50 పాఠశాలలకు చెందిన 150 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులకు తయారీ విధానంపై నేర్పించారు. ఎన్జీసీ జిల్లా సమన్వయకర్త భాస్కర్ నేతృత్వంలో కార్యక్రమం నిర్వహించగా.. హైదరాబాద్ నుంచి ప్రోగ్రాం అధికారి రాజశేఖర్ హాజరై శిక్షణ అందించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులకు ధ్రువపత్రాలు ప్రదానం చేశారు.

రాత్రి చదువు.. ఇంటికి వెలుగు



పంచగామలో రాత్రి చదువుకుంటున్న విద్యార్థినులు

ఆసక్తి ఉండాలే కానీ ఏ సమయంలోనైనా చదువుకోవచ్చు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ ప్రాంతంలో ఈ విధానాన్ని అనుసరిస్తున్నారు. రాత్రి వేళ చదువు మరింత విస్తరిస్తోంది. మండలంలోని ర్యాకల్ జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల సూచనలతో సమయం వృథా చేయకుండా ఈ దిశగా అడుగేయడం గమనార్హం. ఇక్కడి తెలుగు ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ దీనికి బీజం పోశారు. ర్యాకల్, పోతన్‌పల్లి గ్రామాల్లో 8, 9, 10వ తరగతి విద్యార్థులు 157 మంది నిత్యం రాత్రి 7 నుంచి 9 గంటల వరకు ఇలా చదివి సత్ఫలితాలు సాధించారు.

స్ఫూర్తి అందిపుచ్చుకొని..

చంద్రశేఖర్ ఇటీవలి ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా ఖేడ్ జడ్పీ ఉన్నత పాఠశాలకు వచ్చారు. తోటి ఉపాధ్యాయుల సహకారంతో ఇక్కడ సైతం రాత్రి చదువు అమలుకు శ్రీకారం చుట్టారు. ఇక్కడ ఖేడ్ పురపాలికతో పాటు సమీప 45 గ్రామాలకు చెందిన 900 మంది విద్యనభ్యసిస్తున్నారు. ఉపాధ్యాయుల చొరవతో మూడు నెలలుగా 8 గ్రామాల్లో రాత్రి చదువు కొనసాగుతోంది. మరోవైపు ఈ స్ఫూర్తిని అందిపుచ్చుకొని ఖేడ్ మండలం రుద్రారం, కంగ్టి మండలం తర్కవడగామ ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు సైతం దీన్ని పాటిస్తుండటం విశేషం. మరిన్ని చోట్ల రాత్రి చదువుకు ఉపాధ్యాయులు.. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు.

దాతల సహకారం

విద్యార్థులు రాత్రి సమయం వృథా చేయకుండా చదువుపై దృష్టి పెట్టడంతో పలువురు దాతలు తమ సహకారం అందించేందుకు ముందుకొస్తున్నారు. గతేడాది ర్యాకల్ ఉన్నత పాఠశాలలో 157 మందికి శాంతా డెవలపర్స్ యజమాని దుప్పట్లు అందజేశారు. పిల్లలకు ఉపయోగపడేలా నిత్యం పాఠశాల ప్రారంభానికి ముందు గంటపాటు స్పోకెన్ ఇంగ్లీష్ తరగతి నిర్వహించారు. బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌చౌహాన్ పది విద్యార్థులకు రోజూ సాయంత్రం అల్పాహారం అందించారు. ఖేడ్ మండలం పీర్లతండాకు చెందిన ఐఆర్ఎస్ అధికారి సుధాకర్‌నాయక్ పాఠశాలలో గ్రంథాలయంతో పాటు స్టడీ సెంటర్ ఏర్పాటు చేయించారు.

- న్యూస్‌టుడే, నారాయణఖేడ్

పదేళ్లుగా పరాయివాళ్లం: కోదండరాం



ఎమ్మెల్సీ కోదండరాంను సన్మానిస్తున్న ప్రతినిధులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: పదేళ్ల భారాస పాలనలో మనమంతా సొంత రాష్ట్రంలోనే పరాయివాళ్లుగా మిగిలిపోయామని ఎమ్మెల్సీ కోదండరాం ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్నాళ్లూ ఒక్కరి చేతిలోనే పాలన సాగడం దురదృష్టకరమన్నారు. సిద్దిపేటలోని ఎన్జీవోస్ భవన్‌లో తెలంగాణ ఉద్యమకారుల వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం ఆత్మీయ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యమకారుల సమస్యలకు పరిష్కారం దొరకలేదని, వాటిపై చర్చకు వేదిక అవసరమని, విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. తెలంగాణలో నానాటికీ నిరుద్యోగ సమస్య పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్ తెలంగాణ నిర్మాణం కోసం చిత్తశుద్ధితో పనిచేద్దామని ఉద్ఘాటించారు. అనంతరం తమ ఉద్యోగాలను కొనసాగించాలని కోరుతూ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగభద్రత కోసం జూనియర్ కళాశాలల అతిథి అధ్యాపకులు, ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిగ్రీ కళాశాలల ఒప్పంద అధ్యాపకులు వినతిపత్రాలు అందజేశారు. వేదిక ప్రతినిధులు పరమేశ్వర్, పెద్దిరాజు, అందె ప్రవీణ్, విక్రమ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కనకచంద్రం, కొండి మల్లారెడ్డి, అయిత అంజయ్య, బాపురావు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు అనారోగ్యంతో బాధపడుతున్న ఉమ్మడి మెదక్ జిల్లా ఐకాస మాజీ ఛైర్మన్ డా.పాపయ్యను పరామర్శించారు.


అవయవదానంతో మరొకరికి పునర్జన్మ



డా.రవి సుందర్‌ను సన్మానిస్తున్న ఉస్మానియా వైద్యులు

హైదరాబాద్, న్యూస్‌టుడే: అవయవదానంతో ఇతరులకు పునర్జన్మ ప్రసాదించవచ్చని ఉస్మానియా వైద్యకళాశాల ప్రిన్సిపల్ డా.నరేందర్‌కుమార్ అన్నారు. అవయవదానంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జీవన్మృతుడు నుంచి సేకరించిన అవయవాల ద్వారా ఇద్దరికి కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తి చేయడం అభినందనీయమన్నారు. గురువారం ఆసుపత్రిలో పర్యవేక్షకుడు డా.రాకేశ్ సహాయ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడారు. ఉస్మానియా వైద్యుల అభ్యర్థన మేరకు అవయవదానంపై రోగుల సహాయకులకు అవగాహన కల్పించేందుకు ట్రాన్స్‌ప్లాంట్ కో-ఆర్డినేటర్ ఏర్పాటు విషయమై ప్రభుత్వానికి విన్నవిస్తామన్నారు. ఆసుపత్రి సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగాధిపతి డా.సీహెచ్.మధుసూదన్, డా.మనీషా సహాయ్ (నెఫ్రాలజీ), డా.ఎన్.నాగప్రసాద్ (ప్లాస్టిక్ సర్జరీ), డా.మల్లికార్జున్ (యూరాలజీ), డా.చంద్రశేఖర్(అనస్థీషియా) తదితరులు మాట్లాడారు. ఇద్దరికి కాలేయ మార్పిడి, నలుగురికి మూత్రపిండాల మార్పిడి, నలుగురికి కార్నియా మార్పిడి, కాలిన గాయాలకు గురైన వారికి అతికించేందుకు చర్మం అతికించేందుకు అవయవాలు సేకరించినట్లు వెల్లడించారు. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం వల్లంపట్ల గ్రామానికి చెందిన నరేందర్(46)కు ఈ నెల 18న కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసినట్లు వెల్లడించారు.

వీరనారి ఐలమ్మ సేవలు స్ఫూర్తిదాయకం



చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ నీరజ ప్రభాకర్, అధికారులు

ములుగు, న్యూస్‌టుడే: వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను గురువారం ములుగు, మర్కూక్ మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ములుగు ఉద్యాన విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి వీసీ నీరజ ప్రభాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ఐలమ్మ పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. మండల పరిధిలోని మామిడ్యాల కాలనీలో జరిగిన కార్యక్రమంలో ఐలమ్మ చిత్రపటానికి రజక సంఘం మండలాధ్యక్షుడు రాజు, ఏఎంసీ మాజీ వైస్ ఛైర్మన్ భూపాల్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు చేర్యాలకు మంత్రి సురేఖ రాక

చేర్యాల, న్యూస్‌టుడే: రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ శుక్రవారం చేర్యాలలో పర్యటించనున్నట్లు తహసీల్దారు అఫ్జల్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానికంగా ఓ వేడుక మందిరంలో చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేయనున్నారు. ఆమెతో పాటు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొననున్నారు.

నేడు 'నిధి ఆప్ కె నికట్'

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: ఉద్యోగుల భవిష్యనిధి సిద్దిపేట శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం గజ్వేల్‌లోని సెయింట్ పీటర్ పాఠశాలలో 'నిధి ఆప్ కె నికట్-2.0'పై అవగాహన, ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సిద్దిపేట శాఖ కమిషనర్ అవినాష్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. పీఎఫ్ ఖాతాదారులు, పింఛనుదారులు, యజమానులు తమ ఫిర్యాదులను అందజేసి, సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు.

పౌష్టికాహారంతో గర్భిణులకు ఆరోగ్యం

సిద్దిపేట టౌన్: గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం తినాలని ఏసీడీపీవో చాయాదేవి అన్నారు. పోషక మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఇందిరానగర్‌లోని ఐసీడీఎస్ సెక్టార్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ కవిత, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు వినోద, అహ్మద పాల్గొన్నారు.

దూది రైతుకు దుఃఖం

వర్షాభావంతో ఎండుతున్న పైర్లు

న్యూస్‌టుడే, చేర్యాల, సిద్దిపేట, గజ్వేల్: ఎన్నో ఆశలతో పంటలు సాగుచేసిన రైతులకు వర్షాభావం తీరని నష్టాన్ని మిగులుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో అధిక వర్షాలతో పంటలు నీటిలో మునిగిపోతుండగా.. మరికొన్ని చోట్ల వర్షం రోజులుగా వానలు లేకపోవడంతో చేతికొచ్చిన పంటలు ఎండుముఖం పడుతుండటంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నల్లరేగడి భూముల్లోని పత్తి పైరుకు ప్రస్తుతానికి ప్రమాదం లేకున్నా.. వర్షాధారంగా సాగు చేసిన ప్రాంతాల్లో పరిస్థితి దారుణంగా ఉంది. ఎండలకు మొక్కలకు ఉన్న ఆకులు వాడి రాలిపోతున్నాయి. మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే వరి, ఇతర పంటలూ చేతికందక కష్టమేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రాంసాగర్‌లో వాడిపోయిన పత్తి మొక్కలు

1.10 లక్షల ఎకరాల్లో సాగు

ఈ ఏడాది జిల్లాలో 1.10లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. సీజన్ ఆరంభంలో ఆలస్యంగా వర్షాలు కురవడంతో గతంతో పోలిస్తే 10శాతానికి పైగా పత్తి సాగు తగ్గింది. ఒక్కో ఎకరాకు రూ.20వేల నుంచి రూ.30వేల వరకు పెట్టుబడి అయింది.

సర్వే చేయిస్తాం

– రాధిక, జిల్లా వ్యవసాయ అధికారిణి

వర్షాలు త్వరగా పడితే పంటలు కుదురుకుంటాయి. పత్తి వాడిపోయిన ప్రాంతాల్లో మండల వ్యవసాయ అధికారులతో సర్వే చేయిస్తాం. పంటల పరిస్థితిని బట్టి రైతులకు ఏవోలతో సూచనలు ఇప్పిస్తాం.

రెండెకరాలు ఎండిపోయింది

– బాలరాజు, ప్రజ్ఞాపూర్

నేను రెండు ఎకరాల్లో పత్తి సాగుచేశాను. 15 రోజుల నుంచి వానలు లేకపోవడంతో ఎకరం మేర పంట ఎండిపోయింది. పెట్టుబడి అయినా చేతికొచ్చేలా లేదు. పంట సాగుకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదు.

ఆశలు వదులుకున్నా

– శ్రీనివాస్, రైతు, లద్నూరు, మద్దూరు మండలం



వరితో పాటు వర్షాధారంగా 5 ఎకరాల్లో పత్తి సాగు చేశాను. ఇప్పటి వరకు కుటుంబ సభ్యుల కష్టం పోను సుమారు రూ.1.50లక్షల పెట్టుబడి అయింది. ఎర్రచెల్క భూములు కావడంతో వర్షాలు లేక పత్తి మొక్కలు ఎండిపోతున్నాయి. ఇప్పటికే ఆశలు వదులుకున్నా. మరో నాలుగు రోజులు వర్షం పడకపోతే పంట పూర్తిగా ఎండిపోతుంది.

వర్షాలు లేకపోవడంతో ఐదంతా వృథా కాపోవడమే కాకుండా పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చేదెలా అని అన్నదాతలు మదనపడుతున్నారు. ప్రస్తుతం పత్తి పూత, కాత దశ ఉంది.

ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛత సాకారం



శ్రమదానంలో పాల్గొన్న డీఆర్డీవో జయదేవ్ ఆర్య, జడ్పీ సీఈవో రమేష్ తదితరులు

బెజ్జంకి, న్యూస్‌టుడే: గ్రామాల్లో పరిశుభ్రత పెంపొందించేలా చేపడుతున్న కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని డీఆర్డీవో జయదేవ్ ఆర్య, జిల్లా పరిషత్ సీఈవో రమేష్ అన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం దాచారంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో చేపట్టిన శ్రమదానానికి హాజరయ్యారు. ఐకేపీ సభ్యులు, పంచాయతీ, ఉపాధిహామీ సిబ్బందితో కలిసి గడ్డిని తొలగించారు. కార్యక్రమం అమలుపై సభ్యులకు అవగాహన కల్పించారు. అనంతరం మండల కేంద్రంలోని రైతు వేదికలో జయదేవ్ ఆర్య మహిళా సంఘాల వీవోలు, సీసీలతో సమావేశమయ్యారు. బ్యాంకు లింకేజీ, మహిళా శక్తి, స్త్రీనిధి రుణాల పంపిణీ తీరును అడిగి తెలుసుకున్నారు. అదనపు డీఆర్డీవో మధుసూదన్, ఎంపీడీవో ప్రవీణ్, ఏపీఎం నర్సయ్య తదితరులున్నారు.

వైకల్యాలను గుర్తించేందుకు 'ప్రశస్తి'

సిద్దిపేట, న్యూస్‌టుడే: ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో రూపొందించిన 'ప్రశస్తి' యాప్‌పై శిక్షణ కార్యక్రమాన్ని సిద్దిపేట పరిధి రంగధాంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో సముదాయ ప్రధానోపాధ్యాయులకు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, సమగ్రశిక్ష విద్యా సమన్వయకర్త రంగనాథ్ హాజరై మాట్లాడారు. అక్టోబరు 26వ తేదీలోపు ప్రతి పాఠశాలలోని విద్యార్థులకు యాప్ సహాయంతో స్క్రీనింగ్ చేయాలన్నారు.

రహదారిపై మురుగు పరుగు




పట్టణంలోని మైత్రీవనం 'పేజ్-2'లో సరైన రోడ్డు, మురుగునీటి వ్యవస్థ లేకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ సమీపంలో అంతర్గత మురుగునీటి వ్యవస్థ ఉన్నా వాటికి కనెక్షన్లు ఇవ్వకపోవడంతో అక్కడి మురుగు నీరంతా ఓ చోట చేరి దోమలు, ఈగలకు ఆవాసాలుగా మారుతుందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షాలకే రోడ్డంతా గుంతలుగా మారి ప్రమాదకరంగా మారుతున్నాయని తెలిపారు. అధికారులు తక్షణమే సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, సిద్దిపేట టౌన్

తపాలాశాఖ సేవలపై అవగాహన

దౌల్తాబాద్, న్యూస్‌టుడే: తపాలా శాఖ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ సూపరింటెండెంట్ శ్రీహరి అన్నారు. గురువారం మండల పరిధిలోని దొమ్మాటలో జీవిత బీమా, ఇతర బీమా పాలసీలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేవలం రోజుకు రూ.2లు చెల్లించి రూ.15 లక్షల ప్రమాద బీమా పొందవచ్చని తెలిపారు. తపాలాశాఖ ద్వారా అందుతున్న సేవలపై వివరించాలని స్థానిక పోస్ట్‌మాస్టర్లకు సూచించారు. మిరుదొడ్డి మండలం అల్వాలకు చెందిన పల్లె పరశురాములు విద్యుదాఘాతంతో మృతి చెందారు. దీంతో అతని భార్య లావణ్యకు రూ.30 లక్షల బీమా చెక్కును అందించారు. సిద్దిపేట డివిజనల్ ఇన్‌స్పెక్టర్ కుల్కర్ణి సందీప్, మెదక్ తపాలా శాఖ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వృక్షంపై అభిమానం!



ప్రగతినగర్‌లోని ఓ కాలనీలో భారీ వేపచెట్టును అక్కడి స్థానికులు కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. కాలనీలో రోడ్డుకు అడ్డంగా చెట్టు ఉండడంతో అధికారులు సీసీ వేసేటప్పుడు అభ్యంతరం చెప్పినా.. అలాగే వదిలేసి రోడ్డు వేయమని కోరి.. ప్రకృతిపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. వాహనాలు వెళ్లేటప్పుడు ఇబ్బందిగా ఉన్నా సర్దుకొని ప్రయాణిస్తున్నారు. మరోవైపు అదే కాలనీలో నివసించే ఓ వ్యక్తి ఇంట్లోని వృథా నీటితో బంతి, చామంతి మొక్కలు పెంచుతూ పచ్చదనాన్ని పెంచుతున్నారు. - న్యూస్‌టుడే, సిద్దిపేట టౌన్

బాలికల కబడ్డీ పోటీలు ప్రారంభం

సిద్దిపేట, న్యూస్‌టుడే: సిద్దిపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్‌జీఎఫ్ అండర్-19 జిల్లా స్థాయి బాలికల కబడ్డీ పోటీలను జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రోత్సహించారు. క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సమ్మయ్య, స్థానిక కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణరెడ్డి, స్టూడెంట్ కౌన్సెలర్ కనకచంద్రం తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహనతోనే నేరాల నియంత్రణ



డ్యూటీ మీట్‌లో పాల్గొన్న పోలీసు అధికారులకు సూచనలిస్తున్న అదనపు డీసీపీ మల్లారెడ్డి

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: చట్టాల అమలు, అంతర్గత భద్రత, నేరాలను శాస్త్రీయంగా గుర్తించటం వంటివి మెరుగుపరచుకున్నప్పుడే నేరాలకు పరిష్కారం సులభమవుతుందని అదనపు డీసీపీ మల్లారెడ్డి అన్నారు. రాష్ట్రంలో మొదటి సారిగా పోలీసుశాఖలో నిర్వహిస్తున్న డ్యూటీ మీట్ కార్యక్రమం సిద్దిపేట పోలీసు కమిషనరేట్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందికి పలు పరీక్షలు నిర్వహించారు. మొదటి దశలో ఫోరెన్సిక్ సైన్స్, క్రైమ్ ఇన్వెస్టిగేషన్, క్రిమినల్ లా, రాతపరీక్ష మెడికో లీగల్ టెస్టు లాంటివి నిర్వహించారు. రెండో దశలో కంప్యూటర్ అవేర్‌నెస్ ఆఫీస్ ఆటోమేషన్ ప్రోగ్రామింగ్ ఎబిలిటీ పరీక్షలు నిర్వహించారు. డ్యూటీ మీట్‌లో ప్రతిభ కనబరిచిన వారిని అక్టోబరు 4న రానున్న జోన్ స్థాయి డ్యూటీమీట్ ఆ తర్వాత రాష్ట్ర స్థాయి మీట్‌కు ఎంపిక చేస్తామని మల్లారెడ్డి తెలిపారు. అధికారులు, సిబ్బంది జోన్ స్థాయి, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్, కంట్రోల్‌రూమ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశంగౌడ్, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు ధరణీకుమార్, ప్రసాద్, సీఐలు శ్రీను, సైదా తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే తెగుళ్ల నివారణ: డీఏవో



అనంతసాగర్‌లో పత్తి చేను పరిశీలిస్తున్న రాధిక, తదితరులు

చిన్నకోడూరు, న్యూస్‌టుడే: వర్షాలు కురుస్తున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి(డీఏవో) రాధిక అన్నారు. చిన్నకోడూరు మండలంలోని అనంతసాగర్ రైతు వేదికలో గురువారం వరి, పత్తి పంటల్లో నేల ఆధారిత ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పంటల సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. అనంతరం డీఏవో మాట్లాడుతూ.. తెగుళ్లు సోకుతున్న విషయాన్ని రైతులు గమనించి ప్రాథమిక స్థాయిలోనే నివారించుకోవాలన్నారు. సిద్దిపేట ఏడీఏ పద్మ, ఏవో జయంత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట అర్బన్: పంటల్లో యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత వ్యవసాయ డీలర్లపై ఉందని డీఏవో రాధిక అన్నారు. సిద్దిపేటలో వ్యవసాయ డీలర్లకు జరుగుతున్న దేశీ శిక్షణ తరగతులను ఆమె సందర్శించి, నేర్చుకున్న అంశాలను రైతులకు వివరించాలన్నారు. అనంతరం డీలర్లు డీఏవోను సన్మానించారు.

రాయపోల్: మండలంలోని కొత్తపల్లిలో ఆయిల్‌పామ్‌లో అంతర పంటగా వేసిన పత్తిని ఏవో నరేష్ పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.

గుళ్లలో చోరీల నిందితుల అరెస్టు

కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: గుడి తాళాలు పగులగొట్టి వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను కుకునూరుపల్లి పోలీసులు అరెస్టు చేశారు. గురువారం మీడియా సమావేశంలో కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపిన ప్రకారం.. కుకునూరుపల్లి మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ రియాజ్ పాషా(34), చిన్నకిష్టాపూర్‌కు చెందిన సోమి హరీష్(33)లు వృత్తిరీత్యా డ్రైవర్లు. ఇద్దరు కలిసి నాలుగు నెలల క్రితం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల శివారు ఆటోనగర్‌లోని మైసమ్మ గుడి తాళాలు పగలగొట్టి అమ్మవారి రెండు బంగారు ముక్కు పుడకలు దొంగలించారు. ఈ నెల 5న మద్దూర్ మండలం సలాక్‌పూర్‌లోని బీరప్ప గుడి తాళాలు పగలగొట్టి హుండీలోని రూ.10 వేల నగదు ఎత్తుకెళ్లారు. అనంతరం ఈ నెల 19న వర్గల్ మండలం వేలూరు శివారులోని పెద్దమ్మగుడి తాళాలు పగులగొట్టి హుండీ చూడగా అందులో వారికి డబ్బులు దొరకలేదు. ఈ నెల 21న కొండపాక మండల కేంద్రం శివారులోని ఎల్లమ్మగుడి తాళాలు పగులగొట్టి హుండీలో రూ.5 వేల నగదును దొంగలిచ్చారు. ఇద్దరూ కలిసి గురువారం కుకునూరుపల్లి బస్టాండు నుంచి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అక్కడే పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు అనుమానంతో వారిని పట్టుకొని విచారించగా నేరం ఒప్పుకున్నారు. వారి నుంచి ఒక ద్విచక్రవాహనం, తులం బంగారం, రూ.3 వేల నగదు స్వాధీనం చేసుకొని జ్యుడిషియల్ రిమాండుకు పంపించామని తెలిపారు.

బస్సు డ్రైవర్‌పై దాడి- ముగ్గురిపై కేసు

అక్కన్నపేట(హుస్నాబాద్ గ్రామీణం): అక్కన్నపేట మండలం రామవరంలో ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన ఘటనలో ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయభాస్కర్ తెలిపారు. ఈనెల 25 రాత్రి సిద్దిపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రామవరం వచ్చింది. గాంధీ చౌరస్తా వద్ద బస్సులోని ప్రయాణికులను దించేందుకు డ్రైవర్ అక్కడ బస్సు ఆపారు. వెనుక నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చిన అదే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు తమ వాహనానికి సైడ్ ఇవ్వలేదంటూ బస్సు డ్రైవర్ లావుడ్య గోపాల్‌పై దాడి చేశారు. కండక్టర్ అడ్డుకునేందుకు యత్నించినా వినలేదు. బస్సు డ్రైవర్ గోపాల్ ఇచ్చిన ఫిర్యాదుతో బొమ్మ చంద్రశేఖర్, చిగుర్ల రాజుతో పాటు మరో యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆన్‌లైన్‌లో ఆకతాయిలకు అవగాహన

సిద్దిపేట టౌన్: సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఆయా పోలీస్‌స్టేషన్లలో 78 మంది ఆకతాయిలకు ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో గురువారం జూమ్ మీటింగ్ ద్వారా అవగాహన కల్పించారు. సిద్దిపేటలోని మహిళా పోలీస్‌స్టేషన్, గజ్వేల్, హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్లలో మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో అవగాహన కల్పించారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే చట్టప్రకారం ఎలాంటి చర్యలు తీసుకుంటారు? ఎలాంటి శిక్షలు పడతాయనే విషయాలను నిపుణులు క్లుప్తంగా వివరించారు. ఆయా పోలీస్‌స్టేషన్లలో ఇన్‌స్పెక్టర్ దుర్గ, షీటీమ్ ఇన్‌ఛార్జి శ్రీరాములు, కిషన్, సదయ్య, మూడు డివిజన్ల షీటీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు మూర్ఛ.. తప్పిన ప్రమాదం

గజ్వేల్ గ్రామీణ: గజ్వేల్ పట్టణంలో ఓ ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు మూర్ఛ రావడంతో బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కన నిలిపిన వాహనాలను ఢీకొట్టిన ఘటన గజ్వేల్ పట్టణంలో గురువారం జరిగింది. గజ్వేల్ సీఐ సైదా తెలిపిన వివరాలు.. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపోకు చెందిన బస్సు గజ్వేల్ బస్టాండ్ నుంచి డిపోకు వెళ్తుండగా డ్రైవర్ శివకు స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్దకు రాగానే మూర్ఛ రావడంతో బస్సు అదుపు తప్పింది. దీంతో రోడ్డు పక్కన నిలిచి ఉన్న కారు, ద్విచక్ర వాహనం, ఓ తోపుడు బండిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. బస్సులో ప్రయాణికులు ఎవరూ లేరు. మరో డ్రైవర్ వచ్చి బస్సును అక్కడి నుంచి తీసుకెళ్లారు. కారు యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేట టౌన్: మద్యం తాగి పట్టుబడిన పలువురు వాహనదారులకు గురువారం జిల్లా సిద్దిపేట జిల్లా ద్వితీయశ్రేణి జ్యుడిషియల్ న్యాయమూర్తి కాంతారావు జరిమానా విధించారు. గత కొన్ని రోజుల కిందట పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం, నర్సాపూర్, రంగధాంపల్లి చౌరస్తాలు, మెదక్ రోడ్, వేములవాడ కమాన్ వద్ద ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించగా 17 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. నిర్ధారణ పరీక్షల అనంతరం నివేదిక ఆధారంగా వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వారికి మొత్తంగా రూ.19,500 జరిమానా విధించారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు



అక్కన్నపేట వైద్య శిబిరంలో పాల్గొన్న దేవకిదేవి

అక్కన్నపేట(హుస్నాబాద్ గ్రామీణం), న్యూస్‌టుడే: పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని జిల్లా పంచాయతీ అధికారిణి దేవకిదేవి అన్నారు. గురువారం అక్కన్నపేట గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మండలంలోని అన్ని గ్రామాల పారిశుద్ధ్య కార్మికుల కోసం వైద్య శిబిరం నిర్వహించారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ శిబిరాన్ని డీపీవో ప్రారంభించి మాట్లాడారు. మండలంలోని 32 గ్రామాలకు చెందిన కార్మికులు హాజరు కాగా వారికి అక్కన్నపేట, రామవరం పీహెచ్‌సీల వైద్యులు పరీక్షలు నిర్వహించారు.

హుస్నాబాద్: పారిశుద్ధ్య కార్మికులకు స్థానిక బస్తీ దవాఖానలో వైద్య పరీక్షలు నిర్వహించారు. పురాధ్యక్షురాలు రజిత, వైద్యులు తదితరులున్నారు.

అశాస్త్రీయ విధానాలతో తీరని నష్టం: టీపీటీఎఫ్

సిద్దిపేట, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సర్దుబాటు పేరిట వెలువరించిన హేతుబద్ధీకరణ సంబంధిత జీవోని వెంటనే ఉపసంహరించాలని టీపీటీఎఫ్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో ఏవో, జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డికి వేర్వేరుగా గురువారం వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ నేత తిరుపతిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు విజేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుపతి మాట్లాడారు. అశాస్త్రీయ విధానాలతో విద్యా వ్యవస్థకు నష్టం వాటిల్లుతుందన్నారు.

స్వచ్ఛబడి అలంకరణ.. సిబ్బంది ప్రతిజ్ఞ

సిద్దిపేట టౌన్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పట్టణంలోని అంబిటస్ పాఠశాలలో గురువారం విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలంటూ విద్యార్థులు చేసిన డ్రామా ఆలోచింపజేసింది. పారిశుద్ధ్య పర్యవేక్షకురాలు వనిత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగగా విద్యార్థులను అభినందించారు. అంతకుముందు 32వ వార్డులోని హిందూ శ్మశాన వాటిక వెళ్లే దారిలో పారిశుద్ధ్య సిబ్బంది బ్లాక్ స్పాట్‌ను తొలగించారు. అనంతరం పట్టణంలోని గాంధీ పార్కును శుభ్రం చేశారు. స్వచ్ఛబడిలో 'ఐక్యారీ ఐకేర్' కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులకు స్టీల్ నీటి సీసాలు, జనపనార సంచులు, భోజన, అల్పాహార ప్లేట్లు, ఇతర స్టీల్ వస్తువులు అందజేశారు. పాతటైర్లకు రంగులు వేసి అందులో మొక్కలు పెట్టి స్వచ్ఛబడిని అలంకరించారు. అనంతరం అక్కడి సిబ్బంది, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. వావ్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ ప్రశాంత్, జవాన్లు, తదితరులు పాల్గొన్నారు.



పాత టైర్లతో అలంకరించిన మొక్కల వద్ద పారిశుద్ధ్య పర్యవేక్షకురాలు వనిత, సిబ్బంది

బాలలు హక్కుల గురించి తెలుసుకోవాలి

దుబ్బాక: ప్రస్తుత సమాజంలో బాల బాలికలకు వారి హక్కులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా బాలల పరిరక్షణ కౌన్సిలర్ నర్సింలు అన్నారు. గురువారం దుబ్బాక పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో విద్యార్థులకు బాలల హక్కులపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రతినిధి బి.లక్ష్మణ్, ప్రిన్సిపల్ సుజాత, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

సీఎంపీఎస్ విజేత మద్దూరు జట్టు

చేర్యాల: ఐదు రోజులు సాగిన చేర్యాల మెగా ప్రీమియర్‌లీగ్ క్రికెట్ పోటీల్లో మద్దూరు జట్టు విజేతగా నిలిచింది. విజేత జట్టుకు రూ.20వేలు, రెండో స్థానం దక్కించుకున్న చేర్యాల జట్టుకు రూ.10వేలు నగదు ప్రోత్సాహకంతో పాటు బహుమతులను పుర ఉపాధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి తదితరులు అందించారు.

మాజీ ఎంపీపీ మృతికి హరీశ్‌రావు నివాళి

నంగునూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ మాజీ అధ్యక్షురాలు లింగంపల్లి లచ్చవ్వ గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. లచ్చవ్వ మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే హరీష్‌రావు.. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ సంతాపం వ్యక్తం చేశారు.

బతుకమ్మ ఏర్పాట్ల పరిశీలన

దుబ్బాక: రానున్న బతుకమ్మ పండగను పురస్కరించుకొని పురపాలికలోని పలు చెరువుల వద్ద పారిశుద్ధ్య నిర్వహణ, విద్యుద్దీపాల ఏర్పాట్లలో ఇబ్బందులు లేకుండా చూడాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం దుబ్బాక, లచ్చపేటలో పెద్దచెరువు వద్ద బతుకమ్మ ఘాట్‌లను పుర కమిషనర్ రమేశ్‌కుమార్, పలువురు కౌన్సిలర్లతో కలిసి ఆయన పరిశీలించారు. అంగరంగ వైభవంగా ప్రజలు నిర్వహించే బతుకమ్మ వేడుకలకు పుర సిబ్బంది సహకరించాలన్నారు. ఆయన వెంట ఎస్సై గంగరాజు నాయకులు ఉన్నారు.

రెండోరోజు కొనసాగిన రైతుల నిరసన

బెజ్జంకి: తోటపల్లిలో ఇండియన్ బ్యాంకు ఎదుట రైతులు గురువారం రెండో రోజు నిరసన చేపట్టారు. బ్యాంకు అధికారులు ఇచ్చిన గడువు ముగిసినా న్యాయం జరగడం లేదని ఆరోపిస్తూ వీరాపూర్, లక్ష్మీపూర్, తోటపల్లి, తదితర గ్రామాలకు చెందిన రైతులు బ్యాంకుకు చేరుకొని ఆందోళనకు దిగారు. బ్యాంకు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాగ్వాదానికి దిగారు. ఎస్సై క్రిష్ణారెడ్డి అక్కడికి చేరుకొని రైతులకు సర్దిచెప్పడంతో నిరసన విరమించారు.



గజ్వేల్: ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, నాయకులు



చేర్యాలలో పాల్గొన్న పురాధ్యక్షురాలు స్వరూపారాణి, వివిధ పార్టీల నాయకులు



హుస్నాబాద్‌లో పురాధ్యక్షురాలు రజిత, ప్రజా సంఘాలు, రజక సంఘాల నాయకులు

ధీరత్వానికి ప్రతీక ఐలమ్మ

న్యూస్‌టుడే, బృందం: తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా గురువారం జిల్లా వ్యాప్తంగా ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. ఐలమ్మ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని, ఆమె ధీరత్వానికి ప్రతీక అని అదనపు పాలనాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సిద్దిపేటలో ఐలమ్మ విగ్రహానికి బల్దియా అధ్యక్షురాలు కడవేర్గు మంజులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. పోలీసు కమిషనరేట్‌లో అదనపు డీసీపీ మల్లారెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రవీందర్ పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. దుబ్బాకలో ఐలమ్మ విగ్రహానికి మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి నివాళులర్పించారు. పురాధ్యక్షురాలు గన్నె వనిత, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పాల్గొన్నారు. చేర్యాలలో పురాధ్యక్షురాలు స్వరూపారాణి ఆధ్వర్యంలో, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో ఐలమ్మ జయంతి నిర్వహించారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి హాజరై ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. గజ్వేల్‌లో జరిగిన కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పాల్గొన్నారు. సిద్దిపేటలో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు విజయ్‌గణేశ్ ఆధ్వర్యంలో, భాజపా పట్టణాధ్యక్షుడు నరేశ్ ఆధ్వర్యంలో, హుస్నాబాద్‌లో వివిధ ప్రజాసంఘాలు, రజక సంఘం, పురాధ్యక్షురాలు రజిత ఆధ్వర్యంలో ఐలమ్మకు నివాళులర్పించారు. తొగుటలో స్థానిక రజక సంఘం అధ్యక్షుడు బాలయ్య, అక్కన్నపేటలో జంగపల్లి అయిలయ్య తదితరులు పాల్గొన్నారు.



కుకునూరుపల్లి: విగ్రహావిష్కరణలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి, తదితరులు

ఆలయ నిర్మాణానికి చేయూత

హుస్నాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: పందిల్లలో నిర్మాణంలో ఉన్న మహాలింగేశ్వరస్వామి దేవాలయానికి హనుమకొండలోని చింతగట్టుకు చెందిన ఉపాధ్యాయురాలు తంగళ్లపల్లి రేణుక, మురళీమోహన్ దంపతులు చేయూత నందించారు. ఆలయ గర్భగుడి తలుపులు, ముఖద్వారం తయారీకయ్యే మొత్తం ఖర్చు రూ.1,75,000 అందించారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు

దౌల్తాబాద్: దౌల్తాబాద్ మండలంలో ఉపాధి హామీ పథకం కింద 2023-24లో జరిగిన పనులకు వారం రోజులుగా తనిఖీ చేసిన పనులపై గురువారం మండల ప్రజా పరిషత్ ఆవరణలో సామాజిక ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిసైడింగ్ అధికారిగా వచ్చిన అడిషనల్ డీఆర్డీవో బాలకృష్ణ మాట్లాడారు. దౌల్తాబాద్ మండలంలో గత ఆర్థిక సంవత్సరాల్లో మొత్తం 620 పనులకు గాను రూ.3.16 కోట్లు ఖర్చు అయ్యాయన్నారు. తనిఖీల సందర్భంగా మండలపరిధిలోని ఇందూప్రియాల్, మహ్మద్‌షాపూర్, దొమ్మాట, సూరంపల్లి తదితర గ్రామాల్లో జరిగిన తప్పులు, సమస్యలపై మొత్తం రూ.75,300 జరిమానా విధించామన్నారు. ఏపీడీ శివాజీ, క్వాలిటీ కంట్రోల్ అధికారి సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయండి: ఎస్‌ఎఫ్‌ఐ

సిద్దిపేట అర్బన్: బోధన రుసుములు, ఉపకార వేతనాలు విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ సిద్దిపేట డివిజన్ అధ్యక్షుడు సంతోష్, పట్టణాధ్యక్షుడు అభిషేక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలని కోరుతూ సంఘం ఆధ్వర్యంలో సిద్దిపేటలో గురువారం భిక్షాటన చేపట్టారు.

● బోధనా రుసుములు ప్రభుత్వం తక్షణం విడుదల చేయాలని కోరుతూ భారత ఐక్య విద్యార్థి సమాఖ్య(యూఎస్‌ఎఫ్‌ఐ) కార్యదర్శి మధు ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఏవో అబ్దుల్ రహమాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

చేర్యాల: స్థానిక కొత్త బస్టాండు నుంచి అంగడిబజారు వరకు ర్యాలీగా వెళ్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో భిక్షాటన కార్యక్రమం నిర్వహించారు.